పశు గణనకు అందరూ సహకరించాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ నర్సింహయాదవ్, పశువైద్యాధికారి సంధ్యారాణి

ఓల్డ్ బోయిన్‌పల్లి: పశు గణనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ కోరారు. బుధవారం నుంచి 21వ అఖిల భారత పశు గణన కార్యక్రమంలో భాగంగా ఓల్డ్ బోయిన్‌పల్లి ప్రభుత్వ పశు వైద్యధికారి డాక్టర్ సంధ్యారాణితో కలిసి పశుగణన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఓల్డ్ బోయిన్‌పల్లి పశు వైద్యశాల పరిధిలోని తిరుమలగిరి, మారేడ్‌పల్లి, సికింద్రాబాద్ మండలంలో 22 మంది ఎన్యుమరేటర్స్, నలుగురు సూపర్‌వైజర్లతో సర్వే జరుగుతుందని వారు తెలిపారు. ఆవులు, గేదెలు, మేకలు. గొర్రెలు, కుక్కలు తదితర పశువుల యొక్క వివరాలను అందించి సిబ్బందికి సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో పశుగణన అధికారి రాంచందర్ పాల్గొన్నారు.

జేఎన్‌టీయూహెచ్ యోగా జట్ల ఎంపిక



కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీలో యోగా మెన్ అండ్ ఉమెన్ జట్ల ఎంపికను బుధవారం సెక్రటరీ స్పోర్ట్స్ కౌన్సిల్ జేఎన్‌టీయూహెచ్ ప్రొఫెసర్ ఎస్ దిలీప్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ నల్గొండ అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు కైట్ యూనివర్సిటీ భువనేశ్వర్‌లో డిసెంబర్ 24 నుంచి 28 వరకు జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో పాల్గొననున్నట్లు తెలిపారు. జేఎన్‌టీయూహెచ్ ఇండోర్ స్టేడియంలో నూతనంగా ఏర్పాటు చేసిన యోగా హాల్‌లో ఈ సెలక్షన్స్ నిర్వహించారు. హైదరాబాద్ డిస్ట్రిక్ట్ యోగా అసోసియేషన్ జనరల్ సెక్రటరీ జి. సురేంద్ర నాథ్ ఎంపికైన క్రీడాకారులను అభినందించారు.

విదేశాల్లో ఉద్యోగాల పేరుతో మోసం

మూసాపేట: విదేశాల్లో ఐటీ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని ఓ వ్యక్తి డబ్బు వసూలు చేసి మోసం చేశాడు. దీంతో బాధితుడు బుధవారం నిందితుడి ఇంటి ఎదుట నిరసన తెలిపాడు. ఈ ఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని జయనగర్‌లో జరిగింది. జయనగర్‌కు చెందిన గంగరాజు విదేశాల్లో ఐటీ కంపెనీల్లో ఉద్యోగం ఇప్పిసానని నమ్మబలికాడు. వినోద్‌కు స్నేహితుడి వల్ల గంగరాజు పరిచయమయ్యాడు. విదేశాల్లో లక్షల్లో జీతం, ఐటీ కంపెనీలో జాబ్‌లు ఇప్పిస్తానని చెప్పడంతో వాళ్ల అక్కతో, ఇతరులతో, యాప్స్ ద్వారా లోన్లు తీసుకొని రూ.3 లక్షలను రెండు సంవత్సరాల కిందట గంగరాజుకు చెల్లించాడు. ఉద్యోగం ఇప్పించకపోవడంతో తన డబ్బులు తనకు ఇవ్వాలని పలుమార్లు అడిగినా ఇవ్వలేదు. ఇంటికి వెళ్లి అడిగితే న్యూసెన్స్ చేస్తున్నారని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నాడు. పోలీస్ స్టేషన్‌లో తాము ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వినోద్ తెలిపాడు. సుమారు 10 మంది వద్ద డబ్బులు వసూలు చేశాడని, తమకు న్యాయం చేయాలని తన అక్కతో గంగరాజు ఇంటి ముందు నిరసన వ్యక్తం చేశారు.

విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్



పట్టాలు అందుకున్న విద్యార్థులు

బాలానగర్: ఫార్మాస్యూటికల్స్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందని లారస్ ల్యాబ్స్ సీఈవో డాక్టర్ సత్యనారాయణ అన్నారు. బుధవారం బాలానగర్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (నైపర్) హైదరాబాద్, యూనివర్సిటీ 12వ స్నాతకోత్సవ వేడుకను వర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆరోగ్య సంరక్షణకు భారతీయ ఔషధ రంగంలో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయని అన్నారు. విద్యార్థులు పరిశోధన, నైపుణ్యాల ద్వారా ఎంతో అభివృద్ధి జరిగిందని తెలిపారు. అనంతరం 179 మందికి మాస్టర్ డిగ్రీలు, 9 మందికి పీహెచ్‌డీలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నైపర్, హైదరాబాద్ డైరెక్టర్ శైలేంద్ర సరాఫ్, డీన్ నందూరి శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ బి.లక్ష్మి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానా పనులు పూర్తి చేయాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



బ్రాహ్మణ సంఘం భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ శ్రీనివాసరావు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లో జరుగుతున్న బస్తీ దవాఖానా పనులను వెంటనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం కార్పొరేటర్ సబిహాబేగంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు, కాంట్రాక్టర్‌లు పనుల్లో జాప్యం చేయడం వల్ల వేగవంతంగా జరగడం లేదన్నారు. వీలైనంత త్వరగా అధికారులు సహకరించి ఆసుపత్రి సిబ్బందికి, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో గౌసుద్దీన్, ఐలయ్య, వీరారెడ్డి, అస్లాం, సలావుద్దీన్, హమీద్, మొయిన్, వాజిద్, రఫీక్, దుర్గ, ఈఈ శ్రీనివాస్, డీఈ శంకర్ పాల్గొన్నారు.

ప్రహరీ పనులు నిలిపివేయాలి

మూసాపేట: కైత్లాపూర్ సమస్యను పరిష్కరించి, స్థానికంగా ఉన్న ఆలయానికి కావలసిన స్థలం సమస్యను పరిష్కరించే వరకు ప్రహరీ పనులు నిలిపివేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని కైత్లాపూర్ గ్రామం చుట్టూ హౌసింగ్ బోర్డు వారు కంచె వేస్తున్న విషయంపై స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి బుధవారం హౌసింగ్ బోర్డు అధికారులతో మాట్లాడారు. కాలనీ వాసులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూసుకుంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాబురావు, నాయకులు యాదయ్య గౌడ్, సంతోష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘం, ధోబీఘాట్ ప్రాంతాల పరిశీలన

కేపీహెచ్‌బీకాలనీ: బ్రాహ్మణ సంఘం భవనం, ధోబీఘాట్ ప్రాంతాలను కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, జీహెచ్‌ఎంసీ డీసీ వంశీకుమార్, అధికారులతో కలిసి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధోబీ ఘాట్, బ్రాహ్మణ సంఘం భవనం చుట్టూ నిర్మించే ప్రహరీ పనులను పూర్తి చేయాలన్నారు. అదే విధంగా వాటికి సంబంధించిన గేట్లను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఈ శ్రీనివాస్, డీఈ శ్రీదేవి, ఏఈ సాయి ప్రసాద్, రాజేష్ రాయ్, సాయిబాబా చౌదరి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బస్తీ దవాఖానాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే



ప్రహరీ ప్రాంతాన్ని పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

దంపతుల గొడవ.. భార్య ఆత్మహత్య

బాలానగర్: దంపతుల మధ్య గొడవ జరగడంతో భార్య ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. సీఐ నరసింహరాజు వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఉమాపతి, దేవి(30) దంపతులు వినాయకనగర్‌లో నివాసం ఉంటున్నారు. ఉమాపతి పని సరిగ్గా చేయకుండా కుటుంబాన్ని పట్టించుకోవడం లేదని ఇరువురి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో బుధవారం ఉదయం దేవి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రివార్డ్ అందజేత

బాలానగర్: బాలానగర్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆనంద్‌కుమార్, కృష్ణయ్య, యాదప్ప బాలానగర్ స్టేషన్‌లో చాలాకాలంగా గైర్హాజరైన నేరస్థులను గుర్తించి పట్టుకున్నారు. వారి కృషిని అభినందిస్తూ బుధవారం బాలానగర్ డీసీపీ కె. సురేష్ కుమార్ వారికి రివార్డ్‌ని అందజేశారు. కార్యక్రమంలో సీఐ నరసింహ రాజు, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలుడిపై లైంగిక దాడికి యత్నం

పోలీసుల అదుపులో నిందితుడు

మూసాపేట: ఓ పండ్ల వ్యాపారి బాలుడిపై లైంగిక దాడికి యత్నించాడు. ఈ ఘటన 15న వివేకానందనగర్‌లో జరిగింది. మంగళవారం సాయంత్రం నిందితుడిని బంధువులు స్థానికుల సహాయంతో పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసులు, బంధువుల వివరాల ప్రకారం .. బీదర్‌కు చెందిన సైలని బాబా (27)జగద్గిరిగుట్టలో నివాసం ఉంటూ వివేకానందనగర్ కాలనీ సప్తగిరి కాలనీలో పండ్ల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతని భార్య డెలివరీ కోసం పుట్టింటికి వెళ్లింది. వెస్ట్ బెంగాల్ నుంచి భవన నిర్మాణ పనుల నిమిత్తం వివేకానందనగర్ కాలనీలో పని చేస్తున్న ఓ కార్మికుడి ఐదేండ్ల కుమారుడికి సైలనిబాబా వారం రోజులుగా పండ్లు ఇస్తున్నాడు. ఈ నెల 15వ తేదీన బాత్‌రూమ్‌లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి యత్నించడంతో బాలుడు కేకలు వేశాడు. కేకలు వినిపించిన బాలుడి బాబాయ్ బాత్‌రూం తలుపులు తీయగా.. సైలనిబాబా కత్తితో బెదిరించి పరారయ్యాడు. అయితే సప్తగిరి కాలనీలోని కనకదుర్గమ్మ తల్లి ఆలయ సమీపంలో జరుగుతున్న సంతలో బాలుడి తల్లిదండ్రులు పండ్ల అతడిని బంధించి పోలీసులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కూరగాయల మార్కెట్ వద్ద ట్రాఫిక్ కష్టాలకు చెక్



వినతిపత్రం అందజేస్తున్న అశోక్, నర్సింగ్‌రావు

ఓల్డ్ బోయిన్‌పల్లి: అంజయ్యనగర్‌లోని రిటైల్ కూరగాయల మార్కెట్ దగ్గర కొంతమంది రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తుండటంపై ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకున్నారు. దీంతో రిటైల్ కూరగాయల మార్కెట్ కమిటీ చైర్మన్ మక్కాల సత్యనారాయణ సంతోషం వ్యక్తం చేశారు. ట్రాఫిక్ సమస్యను అంబేద్కర్ వ్యవసాయ కూరగాయల మార్కెట్ సెక్రటరీతో కలిసి ఫిర్యాదు చేశామని తెలిపారు. సమస్యను పరిష్కరించినందుకు ఏసీపీ శంకర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇక ముందు కూడా ట్రాఫిక్ సమస్య నెలకొనకుండా ఉండేలా చూడాలని రిటైల్ మార్కెట్ అధ్యక్షుడు మక్కాల అశోక్, ఉపాధ్యక్షుడు మక్కాల నర్సింగ్‌రావు పోలీసులకు వినతిపత్రం అందజేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మూసాపేట: లోదా 33 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ భీమ లింగం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అంకుర్ హాస్పిటల్ ప్రాంతం, కేపీహెచ్‌బీ 7వ ఫేజ్, 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ ఉండదని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

24న గౌడ సంఘం వన భోజన మహోత్సవం

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ కాలనీ చిత్తారమ్మ గుడి ప్రాంగణంలో ఆదివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గౌడ సంఘీయుల 33వ కార్తీక వన భోజన మహోత్సవం నిర్వహించనున్నట్లు కూకట్‌పల్లి కౌండిన్య (గౌడ) సేవా సమితి నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి గౌడ కుల సోదర, సోదరీమణులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థులకు దంత పరీక్షలు



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీలోని శ్రీ సరస్వతి శిశు మందిర్‌లో బుధవారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రోహిణీ సంస్థ ఆధ్వర్యంలో దంత పరీక్షలు నిర్వహించారు. హిమోగ్లోబిన్ టెస్ట్ కూడా నిర్వహించారు. దంతాల సంరక్షణకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సెక్రటరీ పి. సత్యనారాయణ, హెచ్‌ఎం సరస్వతి, కార్యదర్శి పి. శ్రీను, సమితి సభ్యులు శ్రీకాంత్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఏం సాధించారని విజయోత్సవ సభలు

ఆల్విన్‌కాలనీ: కాంగ్రెస్ ప్రభుత్వం ఏం సాధించిందని విజయోత్సవ సభలు జరుపుతుందని మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు అన్నారు. వేములవాడలో కాంగ్రెస్ ప్రభుత్వం జరుపుతున్న విజయోత్సవ సభను ఉద్దేశించి ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

అయ్యప్ప స్వామి మహా పడిపూజ



పూజ అనంతరం పీఏసీ చైర్మన్ గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ను సన్మానిస్తున్న స్వాములు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని తులసివనంలో అయ్యప్ప స్వామి మహా పడి పూజను బుధవారం నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, పీఏసీ చైర్మన్ గాంధీ, కార్పొరేటర్‌లు దొడ్ల వెంకటేష్ గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యేలను అయ్యప్ప స్వాములు సన్మానించారు.

ఎమ్మెల్యే గాంధీపై విమర్శలు సరికాదు



మాట్లాడుతున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాజు

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీపై ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు చేసిన వ్యాఖ్యలు సరికాదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిరుమర్తి రాజు అన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 10 సంవత్సరాలు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన ఘనత బీఆర్‌ఎస్ పార్టీకే దక్కుతుందన్నారు. అమ్ముడుపోయారని చౌకబారు విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. నోటికి వచ్చినట్లు మాట్లాడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. నిత్యం ప్రజల్లో ఉండే సీఎం రేవంత్ రెడ్డి, పీఏసీ చైర్మన్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం..

మోతీనగర్: ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన అల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారము చోటుచేసుకుంది. అల్లాపూర్ పోలీస్ స్టేషన్ సిఐ సామల వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి 100కు ఫోన్ చేసి గుర్తుతెలియని మృతదేహం ఉందన్న సమాచారం అందించాడు. దీంతో పోలీసులు సర్వే నెంబర్ 1007 భాగ్యనగర్ సొసైటీ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పరిశీలించారు. సుమారు 40 సంవత్సరాల వయసు ఉండి దుప్పటితో శరీరం కప్పబడి ఉందని తెలిపారు. మృతుని శరీరంపై ఎటువంటి గాయాలు లేవని, అనారోగ్యంతో మృతి చెంది ఉండవచ్చు అని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి, గాయత్రి నగర్ సెక్టార్ ఎస్సై దేవరాజ్ కేసు నమోదు చేసుకొని సీఐ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కారు ఢీకొట్టడంతో మహిళకు తీవ్ర గాయాలు

కేపీహెచ్‌బీకాలనీ: వేగంగా దూసుకొచ్చిన ఓ మారుతి స్విఫ్ట్ కారు రోడ్డు పక్కన నిలబడిన మహిళను ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. చందానగర్‌కు చెందిన మాధవి శ్రీలక్ష్మి ఈ నెల 17న నిజాంపేట రోడ్డులో ఉండే బంధువుల ఇంటికి వెళ్లింది. మధ్యాహ్నం 3:30 గంటల సమయంలో బంధువులతో కలిసి క్యాబ్ ఎక్కేందుకు విజేత సూపర్ మార్కెట్ వద్ద రోడ్డు పక్కన నిలబడింది. అదే సమయంలో అతివేగంగా దూసుకొచ్చిన కారు ఆమెను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కుమార్తె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సిద్ధిఖీనగర్‌లో టెన్షన్..టెన్షన్

ఒక్కసారిగా ఒరిగిన భవనం.. పరుగులు తీసిన నివాసితులు



గచ్చిబౌలి: సిద్ధిఖీనగర్‌లో మంగళవారం ఉన్నట్టుండి భవనం ఒక వైపు ఒరగడంతో టెన్షన్ నెలకొంది. దాదాపు 40మందికి పైగానే ఈ భవనంలో నివాసం ఉంటున్నట్లు తెలుస్తోంది. భవనం ఒరగడంతో అద్దెకు ఉంటున్న వలస జీవులు భయంతో బయటకు పరుగులు తీశారు. భవనం పక్కకు ఒరిగిందన్న సమాచారంతో ఆ ప్రాంతవాసులు వందల సంఖ్యలో తరలి వచ్చారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న ఆందోళనతో బాధితులతో పాటు చుట్టు పక్కల వారంతా తెల్లవార్లు పడిగాపులు కాశారు. భవనం వైపు ఎవరు వెళ్లకుండా జీహెచ్‌ఎంసీ అధికారులు, పోలీసులు, డీఆర్‌ఎఫ్ సిబ్బంది చర్యలు తీసుకున్నారు. ఈ భవనంతో పెను ప్రమాదం పొంచి ఉందని భావించిన జీహెచ్‌ఎంసీ అధికారులు కూల్చివేయాలని నిర్ణయించారు. భవనం చుట్టూ ఉన్న 20 భవనాలను ఖాళీ చేయించారు. అన్ని రోడ్లు ఇరుకుగా ఉండటంతో ఒక వైపు నుంచే జాగ్రత్తగా కూల్చివేత జరపాలని ఇంజనీరింగ్ అధికారులు సూచించారు. బుధవారం ఉదయం 11.20 గంటలకు వెస్ట్ జోనల్ కమిషనర్ ఆర్.ఉపేందర్ రెడ్డి పర్యవేక్షణలో కూల్చివేతలు ప్రారంభించారు. కాగా ఘటనకు కారణమైన కాంట్రాక్టర్ కొండ శ్రీనివాస్‌పై మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పిల్లర్ల కోసం తవ్విన గుంతల కారణంగా భవనం ఒరిగిందని శేరిలింగంపల్లి సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ వెంకటరమణ ఫిర్యాదు చేశారు.

పిల్లలతో రోడ్లపైనే ఉన్నాం



వంట చేస్తుండగా భవనం పక్కకు ఒరుగుతుండడంతో బయటకు పరిగెత్తుకుంటూ వచ్చాం. 70 వేల నగదు, రెండు సెల్ ఫోన్లు, ఏటీఎం కార్డులు, సిలిండర్లు, సామగ్రి, బట్టలు గదిలోనే ఉండిపోయాయని తెలిపారు. ఎక్కడ ఉండాలో అర్థం కావడం లేదు. డ్యూటీకి వెళ్లాలి. ఏం చేయాలో అర్థం కావడం లేదు. మా వస్తువులు, నగదు తిరిగి ఇవ్వాలి.

– అంజనాదాస్ సర్దార్

చర్యలు తీసుకోవాలి

తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ అంతస్తులు నిర్మిస్తుంటే సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారు. రెండు అంతస్తులకే నిర్మాణాలను పరిమితం చేయాలి. హైడ్రా అధికారులు అక్రమ నిర్మాణాలను గుర్తించి చర్యలు తీసుకోవాలి.

– రవి కుమార్‌యాదవ్

పేక మేడల్లా భవనాలు

ఇరుకు రోడ్లు.. ఫైరింజన్‌కు దారిలేదు



శేరిలింగంపల్లి సర్కిల్‌లోని సిద్ధిఖీనగర్‌లో అంతర్గత రోడ్లు పది అడుగులకే పరిమితమయ్యాయి. దీనికితోడు స్లాబ్‌లు బయటకు రావడంతో ఆపత్కాలంలో ఫైరింజన్ వెళ్లడం చాలా కష్టంగా మారింది. పేక మేడల్లాంటి ఇళ్లకు ఇరుకైన రోడ్లు సవాల్‌గా మారాయి. ఈ రోడ్లలో ఫైరింజన్, ఆంబులెన్స్ కూడా వెళ్లలేకపోవడం గమనార్హం. మంగళవారం రాత్రి భవనం ఒరిగిపోవడంతో అక్కడికి వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఐరిచ్ జంబో క్రషర్ మిషన్‌ను భవనం వద్దకు తీసుకొచ్చేందుకు అధికారులు, సిబ్బంది నానా ఇబ్బందులు పడ్డారు. కొండాపూర్ డివిజన్ పరిధిలోని సిద్ధిఖీనగర్, అంజయ్యనగర్‌లలో 20 అడుగుల రోడ్లు .. కొన్నిచోట్ల పది 10 నుంచి 15 అడుగులకే పరిమితమయ్యాయి. అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటే కనీసం ఫైరింజన్ వెళ్లలేని పరిస్థితి ఉంది. జీహెచ్‌ఎంసీ అధికారులు 30 అడుగుల రోడ్డు ప్రాతిపదికన నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నా వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంటోంది. రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో అత్యవసర సమయాల్లో వాహనాలు వెళ్లే పరిస్థితి లేకుండా పోతోంది.

సెట్‌బ్యాక్.. రోడ్లు లేవు

సిద్ధిఖీనగర్, అంజయ్యనగర్‌లో భవనాలు పేక మేడలను తలపిస్తున్నాయి. 50 చదరపు గజాల స్థలంలో ఐదంతస్తులు, వంద చదరపు గజాల స్థలంలో ఆరు అంతస్తుల నిర్మాణం చేపట్టడం రివాజుగా మారింది. అద్దెకు ఆశపడి కనీసం సెట్ బ్యాక్స్, రోడ్డు లేకుండా నిర్మాణాలు జరిగాయి. నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా చేపట్టే నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంతైనా ఉంది.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225462